పారిశుధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

☑ ములుగు జిల్లా పంచాయతీ అధికారి ఒంటేరు దేవరాజు



ఆంధ్రజ్యోతి : పంచాయతీల నిర్వహణ ఎలా ఉంది..?

డీపీవో : ములుగు జిల్లాలోని 174 గ్రామపంచాయతీల నిర్వహణ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో సక్రమంగా సాగుతోంది. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : పారిశుధ్య పనులు జరుగుతున్నాయా..?

డీపీవో : పారిశుధ్య పరిరక్షణపై ప్రధానంగా దృష్టిసారించాం. ప్రతిరోజూ గ్రామాల్లో క్లీనింగ్ పనులు జరుగుతున్నాయి. తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి కంపోస్ట్ తయారు చేస్తున్నాం. ప్రతినెలా 1, 11, 21తేదీల్లో నీటి ట్యాంకులను శుభ్రంచేసి బ్లీచింగ్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనం ఎలా సాగింది..?

డీపీవో : ప్రభుత్వ పిలుపుతో పల్లెపల్లెనా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాం. 174పంచాయతీలలోని నర్సరీలలో మొక్కలను పెంచి 50వేలకు పైగా నాటించాం. పారిశుధ్య పరిరక్షణపై ప్రజలకు చైతన్యం కల్పించాం.

ఆంధ్రజ్యోతి : పోస్టుల ఖాళీ పరిస్థితి ఏమిటి?

డీపీవో: ఇటీవల డీఎస్సీలో ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయి. గోవిందరావుపేట ఎంపీవో పోస్టుతో కలిపి మొత్తం ఆరు ఖాళీలు మాత్రమే ఉన్నాయి. త్వరలో వీటిని భర్తీ చేస్తాం.

ఆంధ్రజ్యోతి : మినీ మేడారం జాతరకు సన్నద్ధమయ్యారా..?

డీపీవో : వచ్చే ఏడాది జరిగే మినీ మేడారం జాతర కోసం జిల్లా పంచాయతీశాఖ సిద్ధంగా ఉంది. రూ.50లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు సమర్పించాం. భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తాం.

- ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

ఫటాఫట్




(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి)

నిఘా వ్యవస్థ నిద్రపోతోంది. ఇసుకాసురులకు కాసుల పంట పండుతోంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అడ్డూ అదుపులేకుండా ఇసుక దందా జోరుగా కొనసాగుతోంది. ఈ అక్రమ వ్యాపారంలో కోట్లాది రూపాయల అవినీతి చోటు చేసుకుంటోంది. భూగర్భ గనుల శాఖ మొదలుకొని రెవెన్యూ పోలీసు శాఖలకు చెందిన ఉన్నత స్థాయి ఉద్యోగులు మామూళ్ల రూపేణా భారీగా లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం పర్యవేక్షణ మధ్య జరగాల్సిన ఇసుక రవాణా అధికారుల ఉదాసీనత కారణంగా ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. ప్రతిరోజూ వందల లారీల్లో అదనపు దోపిడీ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి రోజుకు రూ.కోటి నుంచి రూ. 2 కోట్ల వరకు గండి పడతోందని తెలుస్తోంది. అంతేకాదు.. చీకటిమాటున పెద్ద మొత్తంలో జీరో వ్యాపారం కూడా నడుస్తోందనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇటీవల ఈ రెండు జిల్లాల్లోని మొత్తం 11 ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాల వ్యవహారంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నప్పటికీ నిగ్గు తేల్చాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

భూపాలపల్లి జిల్లాలో మొత్తం నాలుగు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ములుగు జిల్లాలో ఏడు ఉన్నాయి. వీటి ద్వారా ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించగా, ములుగు జిల్లాలో గిరిజన సొసైటీల ద్వారా ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఒక క్యూబిక్ మీటరుకు రూ.600 ధర నిర్ణయించి ఇసుకను విక్రయి స్తుండగా నిబంధనల ప్రకారం ఒక్కో లారీలో అనుమతిం చిన దానికంటే అధిక మొత్తంలో లోడింగ్ చేస్తూ అదనపు దోపిడీకి పాల్పడుతున్నట్లు ఇటీవల తేలింది. అంతేకాదు.. లారీల్లో ఓవర్ లోడింగ్ కారణంగా సర్వీస్ రోడ్లు మొదలుకొని ప్రధాన రహదారుల వరకు అన్ని ధ్వంసమైపోతున్నా మామూళ్ల మత్తులో జోగుతున్న రవాణా శాఖ సిబ్బంది కనీస తనిఖీలు నిర్వహించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇసుక అక్రమ రవాణా విషయంలో పోలీసులకు కూడా ప్రభుత్వం 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినప్పటికీ నియంత్రించకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారనే ప్రచారం జరుగుతోంది.

ఇదిలా ఉంటే ఓవర్ లోడ్‌తో వెళ్లే లారీలు ప్రజల పాలిట మృత్యు శకటాలుగా మారిపోతున్నాయి. ఇసుక లారీపై పని చేసే అత్యధిక సిబ్బంది నైపుణ్యం లేమి, సరైన శిక్షణ లేని వారే ఉంటున్నారు. రాత్రి వేళల్లో డ్రైవర్లు మద్యం మత్తులో ఇసుక లారీలు నడుపుతూ ఈ ఏడాది కాలంలో అనేక ప్రమాదాలకు కారణమయ్యారు. నాలుగు నెలల్లోనే ఇసుక లారీల కారణంగా భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో దాదాపు 15మంది ప్రాణాలను కోల్పోయారు. ఇంత జరుగుతున్నా జిల్లా రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీలు చేపట్టకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లి క్వారీలో లోడింగ్ ప్రక్రియ

ఇసుకాసురుల ఇష్టారాజ్యం

- రీచుల్లో కొరవడిన నిఘా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- యథేచ్ఛగా జీరో, అదనపు బకెట్ల దందా
- ఓవర్ లోడింగ్‌తో దెబ్బతింటున్న రోడ్లు
- కనీస తనిఖీలు చేయని రవాణా శాఖ
- పోలీసుల పాత్ర షరా 'మామూలే..'

నిబంధనలేం చెబుతున్నాయి?

భూపాలపల్లి ములుగు జిల్లాల్లో ఇసుక వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ప్రతిరోజూ ఇక్కడ నుంచి 800కు పైగా లారీలు వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ తదితర నగరాలకు ఇసు కను రవాణా చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం లారీల సామర్థ్యాన్నిబట్టి అందులో బరువులను నిర్ణయించారు. పది చక్రాలు కలిగిన లారీలో 19.5 టన్నుల ఇసుకను మాత్రమే తరలించాల్సి ఉంది. 12 చక్రాలు కలిగిన లారీలో 26టన్నులు, 14చక్రాలు కలిగిన లారీలో 32టన్నులకు మించి ఇసుకను అనుమతించరాదు కానీ చిన్న లారీల్లో తక్కువలో తక్కువగా 25టన్నులు, మీడియం 30టన్నులు, 14 టైర్ల లారీల్లో 40 నుంచి 45 టన్నుల ఇసుకను తరలించాలి. ఇవన్నీ టీజీఎండీసీ నిబంధనలు ఉన్నప్పటికీ అదనపు బకెట్ల పేరిట ఇసుకను లోడింగ్ చేసే కాంట్రాక్టర్లు ఒక్కో లారీపై రూ. 5వేల నుంచి రూ.10వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా వచ్చిన అదనపు మొత్తాన్ని ఖనిజాభివృద్ధి శాఖ అధికారులు మొదలుకొని హైదరాబాద్ వరకు ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి, రవాణాశాఖ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి మామూళ్ల రూపంలో కాసుల పంపిణీ జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో పోలీసులకు అధికారి స్థాయినిబట్టి నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ముట్ట చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇక మైనింగ్, ఎండీసీ, రెవెన్యూ సిబ్బందికి మాత్రం ఏ రోజుకారోజు ప్రతిపాదికన మామూళ్లు అందుతున్నాయని తెలిసింది.

జీరో దందా సాగేది ఇక్కడే..

ఇసుక అక్రమ రవాణాలో ప్రధానంగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి, పలుగుల, ములుగు జిల్లా మంగపేట, వెంకటాపూర్ ప్రాంతాల్లోనే పెద్ద ఎత్తున ఇసుక జీరో దందా కొనసాగుతున్నట్లు గుర్తించారు. ఇక్కడ పగలంతా అదనపు బకెట్ల రూపంలో దోపిడీకి పాల్పడుతున్న కాంట్రాక్టర్లు, రాత్రివేళ చీకటిమాటున అధికారుల కన్నుగప్పి ఓకే పర్మిట్‌పై రెండు, మూడు లారీల ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో పోలీసులు వరుసగా దాడులు నిర్వహించడంతో తాత్కాలికంగా ఇది ఆగిపోయినా తిరిగి మళ్లీ మొదలయ్యే అవకాశాలున్నాయని స్థానికులు చెబుతున్నారు. భూపాలపల్లి జిల్లాలో మద్దులపల్లి, విలాసాగర్ పంకెన, పెద్దంపేట నాలుగు ఇసుక రీచ్‌లు ఉండగా, ఇందులో మద్దులపల్లి క్వారీలోనే భారీగా అక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. మానేరుపై ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేయడంతో ఇక్కడ గోదావరి ఇసుకకు హైదరాబాద్‌లో భారీగా డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకునే లారీ డ్రైవర్ల సాయంతో కాంట్రాక్టర్లు భారీగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక రీచుల వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి నామమాత్రమేననే ఆరోపణలు ఉన్నాయి. మహాదేవపూర్ నుంచి హైదరాబాద్ వరకు ఇసుక అదనపు బకెట్లు, జీరో వ్యాపారాన్ని గుర్తించేందుకు సరైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం కూడా అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోందని తెలుస్తోంది.



ఎగిసిపడుతున్న మంటలు

ఎగిసిపడ్డ అగ్నికీలలు

- షాపింగ్ కాంప్లెక్స్‌లో మంటలు
- పది దుకాణాలు ఆహుతి
- ఏడు గంటలు శ్రమించిన ఫైర్‌సిబ్బంది
- పూర్తిగా కాలిపోయిన విలువైన వస్తువులు
- రూ.20 కోట్లకు పైగా ఆస్తి నష్టం

జనగామ జిల్లా కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఫైర్ సిబ్బందికి విషయం చేరవేశారు. జనగామ ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకున్నా.. షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్లు తెరుచుకోలేదు. దీంతో వెంటనే ఎక్స్‌కావేటర్ రప్పించి షట్టర్‌ను తొలగించారు. అప్పటికే పెద్దఎత్తున అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల ఫైరింజన్లను రప్పించారు. ఉదయం 5.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30వరకు ఆరు ఫైరింజన్ల ద్వారా 40 మంది సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఎట్టకేలకు మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో పది షాపుల్లోని ఖరీదైన వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మొత్తంగా సుమారు రూ.20కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.

-జనగామ(ఆంధ్రజ్యోతి)

పదవి అలంకరణ

బాధ్యతలు స్వీకరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



ములుగు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బానోత్ రవిచందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రవిచందర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య హాజరై రవిచందర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, యూత్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

మేడారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో సందడి నెలకొంది. వనదేవతలను భక్తులు భారీ సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి మేడారం చేరుకొని సమ్మక్క- సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరె సారెలు సమర్పించుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. సుమారు 10వేల మంది అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

పేదలకు ప్రభుత్వం బాసట

- అన్ని వర్గాల సంక్షేమానికి కృషి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ రావు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను భూపాలపల్లి, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. భూపాలపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి రేవంత్ సర్కారు విశేష కృషి చేస్తోందన్నారు. ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాంచంద్రయ్య, ముంజాల రవీందర్, అనిల్, రంజిత్, శ్రీనివాస్, కిషన్, పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఎమ్డీ.రఫి, నాయకులు ఏకు రవీందర్, దుప్పటి శ్రీనివాస్, ఐలుమల్లు, మొగుళ్లపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి సుదర్శన్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



సామాజిక సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

వివరాలు : 6లో..

జనతన సర్కార్ ఆర్‌పీసీ బామన్ లొంగుబాటు

ములుగు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జనతన సర్కార్ జారపల్లి రీజనల్ పార్టీ కమాండర్ (ఆర్‌పీసీ)గా పనిచేస్తున్న తాటి బామన్ ఆదివారం ములుగు ఓఎస్డీ రవీందర్ ఎదుట లొంగిపోయాడు. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధి సేండ్రంబోర్ గ్రామానికి చెందిన బామన్ 2004లో అప్పటి పామేడు దళ కమాండర్ ముఖేష్ ప్రోద్బలంతో మిలీషియా సభ్యుడిగా మావోయిస్టు పార్టీలో చేరాడని ఓఎస్డీ తెలిపారు. 2010లో జారపల్లి ఆర్‌పీసీ సోడి దేవా అరెస్టు తర్వాత బామన్ ఆ బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 2006లో తేగ్గూడెం వద్ద ఆకస్మిక దాడిలో 12 మంది పోలీసులు మరణించిన ఘటన, 2013లో సేండ్రంబోర్ వద్ద ఎదురుకాల్పులు, 2019లో యంపూర్ వద్ద జరిగిన ఎదురుకాల్పులు, ఈఏడాది పామేడు పరిధి ధర్మారం పోలీసు క్యాంపుపై జరిగిన దాడిలో బామన్ పాల్గొన్నాడని వివరించారు. మావోయిస్టు అగ్రనాయకత్వ సూచనల మేరకు పామేడు అటవీ ప్రాంతంలో పోలీసులు లక్ష్యంగా పెద్దఎత్తున బూబీట్రాప్స్, ల్యాండ్‌మైన్స్ అమర్చినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల దాడులు పెరిగిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలకు ఆకర్షితుడై భార్యా పిల్లలతో ప్రశాంత జీవనం గడిపేందుకు జనజీవన స్రవంతిలో కలవాలని బామన్ నిర్ణయించుకున్నాడని ఓఎస్డీ చెప్పారు. పునరావాస ప్రక్రియలో భాగంగా లొంగిపోయిన బామన్‌కు నగదు పారితోషికంతోపాటు ఉపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు.



ఓఎస్డీ ఎదుట లొంగి పోయిన మావోయిస్టు బామన్

వరి కోతలు షురూ..

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో వానాకాలం(ఖరీఫ్) వరి కోతలు షురూ అయ్యాయి. బోరు బావుల కింద స్వల్పకాలిక వంగడాలు పెట్టిన రైతులు హార్వెస్టర్లతో వరి కోతలు చేపడుతున్నారు. రేగులగూడెం, గొల్లపల్లి, దేవరాంపల్లి, చల్లపల్లి, శంకరంపల్లి, భూడిదపల్లి తదితర గ్రామాల్లో ఇవి ప్రారంభమయ్యాయి. మండలంలో ఈ సీజన్‌లో సుమారు 9వేల ఎకరాల్లో సన్న రకం వరి సాగు చేయగా 3వేల ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగైనట్లు తెలుస్తోంది. పలు గ్రామాల్లో ప్రతిసారి బోరుబావుల కింద వరి నాట్లు ముందే వేస్తుండగా కోతలు కూడా ముందే వస్తాయి. మొదట దొడ్డు రకం వరి పొలాలు కోతకు రాగా మరికొన్ని రోజుల్లో కోతలు ముమ్మరమవుతాయి. ధాన్యం అమ్ముకోవడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


వరిని కోస్తున్న హార్వెస్టర్

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు

మల్హర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్య మకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయా లని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయ కులు డిమాండ్ చేశారు. తాడిచర్లలో మండల అధ్యక్షుడు బూడిద సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమారులకు గుర్తింపు కార్డుల ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, అధికార ప్రతినిధి బోయిని రాజయ్య, రాష్ట్ర కో కన్వీనర్ దుబాసి పార్వతక్క, మండల మహిళా అధ్యక్షురాలు బండారి యశోధ, రాష్ట్ర నాయకురాలు గడ్డం సమ్మక్కతోపాటు షేక్ చాంద్‌పాషా, మీనుగు నాగయ్య, తోకల గట్టయ్య, ఆవిర్నేని పురుషోత్తంరావు, రౌతు బీమయ్య, ఇండ్ల శివ, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌కు విశేష స్పందన


పరీక్ష తీరును పరిశీలిస్తున్న చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నయీంనగర్ బ్రాంచ్‌లో నిర్వహించిన మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ కు విశేష ఆదరణ లభించినట్లు నయీంనగర్ బ్రాంచ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. 800 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఐఐటీ, మెడికల్ విద్యకోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా హనుమకొండలోనే అభ్యసించేందుకు రాజస్థాన్ కోటా బ్రాంచ్ ఆధ్వర్యంలో అత్యున్నతమైన ప్రమాణాలతో మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ స్థాపించినట్లు తెలిపారు. టాలెంట్ సెర్చ్ పరీక్షలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కోటా హెడ్ సెంటర్ అనేక రాయితీలను ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. 15 రోజుల్లోనే ఫలితాలు విడుదలవుతాయని, పరీక్ష రాసిన విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రోత్సహించిన అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్స్ చీర గణేశ్, పెరమాండ్ల అనిల్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనగరపు సుమన్, తాళ్లపల్లి రమేశ్, రచ్చ కుమార్, పాక నాగరాజు, రవీందర్‌రావు, శశిధర్, అరుణ్ పాల్గొన్నారు.

భారీ అగ్నిప్రమాదం

- పది దుకాణాలు అగ్నికి ఆహుతి
- ఏడు గంటలు శ్రమించిన ఫైర్ సిబ్బంది
- కాలిపోయిన విలువైన వస్తువులు
- రూ.20 కోట్లకు పైగా ఆస్తి నష్టం
- ఘటనా స్థలాన్ని సందర్శించిన భువన గిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎగిసి పడిన మంటలు


సంఘటనా స్థలంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి

జనగామ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కళ్లముందే దుకాణాలన్నీ కాలి బూడిదయ్యాయి. ఓ దుకాణంలో చెలరేగిన మంటలు కాంప్లెక్స్‌లోకి పదికి పైగా దుకాణాలకు వ్యాపించి, చూస్తుండగానే మంటల్లో కాలిపోయాయి. గంటల తరబడి శ్రమించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో భారీ ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటనలో రూ.20కోట్ల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జనగామలోని సిద్దిపేట రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున 5.30గంటల సమయంలో షాపింగ్ కాంప్లెక్స్‌లోని విజయ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. మొదట్లో కొద్దిపాటి పొగలు రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి జనగామ అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు.

వారు వచ్చేలోపే మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. ప్రమాదంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విజయ షాపింగ్ మాల్ షట్టర్లు తెరుచుకోలేదు. దీంతో లోపల ప్రమాద మరింత తీవ్రత పెరిగింది. క్రమక్రమంగా మం టలు విజయ షాపింగ్ మాల్ నుంచి కాంప్లెక్స్‌లో ఉన్న ఇతర దుకాణా లను వ్యాపించాయి. మొదటగా పక్కనే ఉన్న ఎస్‌ఆర్ బ్రదర్స్ ఆ తర్వాత శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్‌కు వ్యాప్తి చెందాయి. సిబ్బంది మంటలను ఆర్పేం దుకు ప్రయత్నం చేయగా అదుపులోకి రాకపోవడంతో షాపింగ్ మాల్ షట్టర్లను జేసీబీ సాయంతో తొలగించి మంటలను ఫైర్ ఇంజిన్ ద్వారా నీటి చల్లి ఆర్పే ప్రయత్నం చేశారు. ఉదయం 5.30 గంటలకు ప్రారం భమైన మంటలు మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత కొద్దిగా అదుపులోకి వచ్చాయి.

బట్టలు, ప్లైవుడ్ కావడంతో..

కాంప్లెక్స్‌లో ఎక్కువగా బట్టలు దుకాణాలు ఉండడంతో మంటలు శరవేగంగా వ్యాపించాయి. దీనికి తోడు అన్ని దుకాణాల్లోనూ ప్లైవుడ్‌తో చేసిన కబోర్డ్స్ అధికంగా ఉండడంతో మంటలు వేగంగా విస్తరించాయి. దీంతో మంటలను అదుపు చేయడం కష్టంగా కష్టంగా మారింది. ఫైర్ ఇంజన్ల ద్వారా నీటిని చల్లినా దుకాణాల్లోని మంటలు అదుపులోకి రాలేదు.

ఆరు ఫైర్ ఇంజన్లు.. 40 మంది సిబ్బంది

తొలుత జనగామ ఫైర్ ఇంజన్ రాగా, ప్రమాద తీవ్రత ఎక్కువ కావడంతో స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తితోపాటు యాదాద్రి జిల్లా ఆలేరు, భువనగిరి, సూర్యాపేట జిల్లా మోత్కూరు అగ్నిమాపక కేంద్రాల నుంచి ఫైర్ ఇంజిన్లను రప్పించారు. ఆరు ఫైర్ ఇంజన్లతో సుమారు 40 మంది సిబ్బంది ఏడు గంటలకు పైగా శ్రమించారు. ఒక్కో ఫైర్ ఇంజన్ ఐదారుసార్లు నీటిని నింపుకొని వచ్చి చల్లినా మంటలు అదుపులోకి రాలేదు. ఎంతకూ మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక అధికారులు 'ఫైర్ కెమ్' (ఫోమ్) రసాయనాన్ని నీటితో కలిపిచల్లారు. కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న మరో బిల్డింగ్ ఎక్కి ఫోమ్‌తో కూడిన వాటర్ చల్లడం, కెమికల్ చేసి విసరడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

రూ.20 కోట్ల ఆస్తి నష్టం?

షాపింగ్ కాంప్లెక్స్ దగ్ధమైన ఘటనలో సుమారు రూ. 20కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కాంప్లెక్స్‌లో ప్రముఖ వస్త్ర దుకాణాలైన విజయ షాపింగ్ మాల్, శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్‌తో పాటు ఎస్‌ఆర్ బ్రదర్స్ బట్టల దుకాణం, కంగన్‌హాల్, లేడీస్ టైలరింగ్ షాప్, మగ్గం వర్క్స్ దుకాణం, స్టీల్ దుకాణం వంటి షాపులు పదికి పైగా ఉన్నాయి. ఈ ఘటనలో అన్ని షాపుల్లో ఉన్న విలువైన పట్టుచీరలు, దుస్తులు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.20కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కాగా.. విజయ షాపింగ్ మాల్‌లో ఉన్న ఇన్వర్టర్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడం మూలంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దుకాణాల్లో బట్టలు ఉండడం, ప్లైవుడ్‌తో చేసి కబోర్డ్స్, థర్మాకోల్ ఫాల్స్ సీలింగ్ కారణంగా మంటలు వేగంగా వ్యాప్తి చెందాయని ఫైర్ సిబ్బంది అంటున్నారు. కాగా.. షాపింగ్ కాంప్లెక్స్‌లోని విజయ షాపింగ్ మాల్‌లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థ లేదని, అదే గనుక ఉంటే ఫైర్ అలారమ్ మోగడంతోపాటు ఆటోమెటిక్‌గా నీటిని చల్లి మంటలను ఆర్పే అవకాశం ఉండేదని, ఆ వ్యవస్థ లేకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని ఫైర్ అధికారులు చెబుతున్నారు.

ఏడు గంటలు కఠోర శ్రమ

అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో అగ్ని ప్రమాద శాఖ, పోలీస్ శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు కఠోరంగా శ్రమించారు. ప్రమాదం నేపథ్యంలో ఓ వైపు జనగామ- సిద్దిపేట ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కాగా జనాలు పెద్ద సంఖ్యలో పోగయ్యారు. వీరందరినీ పక్కకు జరిపి మంటలను అదుపులోకి తేవడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఘటన స్థలాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి సందర్శించి పరిస్థితి పర్యవేక్షించారు. వీరితోపాటు హనుమకొండ, వరంగల్, భువనగిరి జిల్లాల ఫైర్ సేఫ్టీ అధికారులు జైపాల్‌రెడ్డి, శ్రీధర్, మధుసూదన్‌రావుతో పాటు జనగామ, పాలకుర్తి, భువనగిరి స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు రేమండ్ బాబు, శ్రీరాములు, మధుకర్ దగ్గరుండి మంటలను అదుపు చేయడంలో సూచనలు చేశారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన భువనగిరి ఎంపీ

ఘటనా స్థలాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సాయంత్రం సందర్శించారు. ప్రమాదానికి కారణాలను బాధితులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు ఎంపీని కోరగా పరిహారం వచ్చేలా చూస్తానని భరోసానిచ్చారు.


కెమికల్ ఫోమ్‌తో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రామప్పలో కార్తీక మాసం ఏర్పాట్లు

- వచ్చే నెల 2 నుంచి ప్రారంభం
- నెలరోజులపాటు ప్రత్యేక పూజలు
- దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత

వెంకటాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలను నవంబరు 2నుంచి వైభవంగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యామని దేవాదాయ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నెలరోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రూ.1116 దేవాలయంలో చెల్లించి రశీదు పొందితే కార్తీకమాసం నెలవారీ అభిషేకాలతోపాటు ఓంకార పట్టువస్త్రాలు, లడ్డూ ప్రసాదం అందజేస్తారని తెలిపారు. శివుడికి అత్యంత ప్రియమైన కార్తీకమాసంలో రామప్పలో ప్రవేశపెట్టిన నెలవారీ అభిషేకాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. యునెస్కో నిబంధనలకు అనుగుణంగా కార్తీకపౌర్ణమి రోజున దీపారాధన కోసం ఆలయ ప్రాంగణంలోని మామిడిచెట్టు కింద ఉన్న శివలింగం వద్ద ఏర్పాట్లు చేస్తామని వివరించారు.



అచ్చం బోగీల్లా..

టిప్పర్లు ఒకదాని వెనుక ఒకటి బారులు తీరాయి.. రైలు బోగీలుగా అవి తలపించాయి. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్‌కాస్టు వద్ద ఈ దృశ్యం ఆదివారం ఉదయం కనిపించింది. బొగ్గు లోడు కోసం ఈ టిప్పర్లు భారీ సంఖ్యలో క్యూకట్టాయి.

– మల్హర్ (ఆంధ్రజ్యోతి)

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఈశ్వర్


ఈశ్వర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాజధాని బెంగళూరులో నవంబరు 1వ తేదీ నుంచి 5 వరకు జరిగే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మానుకోట నలంద డిగ్రీ కళాశాల విద్యార్థి చెవుల ఈశ్వర్ ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ ఆదివారం తెలిపారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సెప్టెంబరు నెలలో నిర్వహించిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జట్టు కు ఎంపికైనట్లు వెల్లడించారు. కళాశాలలో బీకాం తృతీ య సంవత్సరం చదువుతున్న ఈశ్వర్ జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, కోచ్ కుమారస్వామి హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ సభ్యత్వాలు ముమ్మరం చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

గోవిందరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాలను ముమ్మరం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్‌బూత్‌లో కనీసం 200 సభ్యత్వాలను పార్టీ శ్రేణులు చేయించాలన్నారు .మండలకేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన ఆదివారం జరిగిన పదాధికారుల సమావేశానికి ప్రేమేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాధారణ సభ్యత్వాలు ఈనెల 31 వరకు పూర్తి చేయాలన్నారు క్రియాశీల సభ్యత్వాలను ప్రతి మండలంలో పూర్తి చేసి మండల కమిటీల ఎన్నిక అయ్యేవిధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణినాయక్, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు శీలమంతుల రవింద్రచారి, భర్తపురం నరేష్, జాడి వెంకట్, బన్న ప్రభాకర్, భూక్య జవహర్‌లాల్, జాడి రామరాజు, ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్, కొత్త సుధాకర్‌రెడ్డి, చందా జ్యోతి, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అంత్యక్రియలకు హాజరై అనంతలోకాలకు...

- ఆడబిడ్డ చావుకు వచ్చి మరదలు హఠాన్మరణం
- కల్లెంలో విషాదం నింపిన వదినా, మరదళ్ల మృతి


అయ్యమ్మ (ఫైల్)


మంగమ్మ (ఫైల్)

లింగాలఘణపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండలం కల్లెంలో ఒకే కుటుంబానికి చెందిన వదినమరదళ్ల మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కల్లెంకు చెందిన బండ అయ్యమ్మ(65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన మృతురాలి తమ్ముడు చిన్నం మామిడయ్య భార్య మంగమ్మ (55) తన ఆడబిడ్డ మృతి సమాచారం తెలుసుకొని వచ్చి మృతదేహంపై పడి ఏడుస్తుండగా అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వచ్చి సొమ్మసిల్లి పడిపోయింది. సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. కాసేపట్లోనే మంగమ్మ మృతి చెందింది. కల్లెంలో ఇద్దరి అంత్యక్రియలు జరిగాయి.

ఓ వైపు అక్క.. మరో వైపు భార్య ..

ఓ వైపు అనారోగ్యంతో తోడబుట్టిన అక్క అయ్యమ్మ, మరోవైపు గుండెపోటుతో భార్య మంగమ్మ మృతి చెందడంతో మంగమ్మ భరత్త చిన్నం మామిడయ్య కన్నీరుమున్నీరయ్యారు. వ్యవసాయ రైతుగా జీవనాన్ని కొనసాగిస్తున్న మామిడయ్య - మంగమ్మ దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పిల్లల పెళ్లిళ్లు అయ్యాయి. మామిడయ్య ఇటీవల మోకాళ్ల నొప్పులకు ఆపరేషన్ చేయించుకున్నాడు. అక్కడే ప్రైవేటు ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో నివసిస్తున్న కుమారుడి ఇంట్లో ఉంటున్నాడు. ఈక్రమంలో ఇద్దరు మృతి చెందడంతో కన్నీరుమున్నీరయ్యాడు.

బైక్‌ను ఢీకొన్న కారు - ముగ్గురికి గాయాలు

గణపురం, అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొని ముగ్గరికి గాయాలైన సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండల కేంద్రానికి చెందిన భరత్, లాస్య దంపతులు స్థానిక యూనియన్ బ్యాంక్ వైపు బైక్‌పై బయల్దేరారు. అదే సమయంలో చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన బండి సంజయ్ కారులో గణపురంలో ఓ ఫంక్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో యూనియన్ బ్యాంక్ సమీపం వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న భరత్, లాస్యకు తీవ్ర గాయాలయ్యాయి. కారు కింద ద్విచక్రవాహనం ఇరుక్కుపోవడంతో సంజయ్ ఆపకుండా సుమారు అరకిలో మీటరు వరకు అలాగే ఈడ్చుకుంట దూసు కెళ్లిపోయాడు. ఈ క్రమంలో కారు కాల్వలో బోల్తాపడింది. అందులో ఉన్న బెలూన్లు తెరుచుకోగా సంజయ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సంజయ్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

జీపీ ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం..

- ఉమ్మడి కురవి మండలంలో 52 గ్రామ పంచాయతీల లిస్టు ఫైనల్
- కోర్టు కేసుల కారణంగా మూడు గ్రామాలు ఆలస్యం
- తేలిన వార్డుల సంఖ్య

కురవి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ ఎన్నికలను ఎప్పుడు జరిపేది.. ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించనప్పటికీ ఎన్నికల సంఘం తన పని తాను చేసుకుపోతోంది. ఇప్పటికే గ్రామాల వారీగా ఓటరు లిస్టులను సిద్ధం చేసింది. కురవి మండలంలోని ఏడు రెవెన్యూ గ్రామాలు విడిపోయి సీరోలు మండలంలో కలిశాయి. అయినప్పటికి ఉమ్మడి కురవి మండలం ప్రాతిపదికగా అధికారులు ఎన్నికల లిస్టులను తయారు చేశారు. ఉమ్మడి కురవి మండలంలో మొత్తం 55 గ్రామపంచాయతీలు ఉండగా, 52 గ్రామాలకు ఓటరు లిస్టులు సిద్ధం అయ్యాయి. కోర్టు కేసుల కారణంగా మూడు జీపీలకు ఓటరు జాబితా ప్రక్రియ మొదలు కాలేదు.

మొత్తం 53, 498 మంది ఓటర్లు..

ఉమ్మడి కురవి మండలంలో మొత్తంగా 53,498 మంది గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళ ఓటర్లు 27,400 ఉండగా, పురుషులు 26,097 మంది ఉన్నారు. ఒక ట్రాన్స్‌జెండర్ ఓటరు లిస్టులో నమోదయ్యారు.

మొత్తం వార్డులు 436..

ఉమ్మడి కురవి మండలంలో మొత్తం 436 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. కురవిలో అత్యధికంగా 14 వార్డులు, సీరోలు, బలపాల, రాజోలు, నేరడ, కాంపెల్లి, గ్రామాల్లో 10 వార్డులకు ఎన్నికలకు జరుగనున్నాయి.


కురవి గ్రామపంచాయతీ కార్యాలయం

మిగతా అన్ని గ్రామాలకు 8 వార్డుల చొప్పున ఎన్నికలు జరుగుతాయి. ఉమ్మడి మండలంలో కురవిలోని మూడో వార్డులో అత్యధికంగా 317 మంది ఓటర్లు ఉన్నారు. బంజరతండా గ్రామపంచాయతీలోని 5వ వార్డులో అత్యల్పంగా 45 మంది ఓటర్లు ఉన్నారు.

కురవి గ్రామంలో అత్యధిక ఓటర్లు..

ఉమ్మడి మండలంలో కురవి గ్రామపంచాయతీలో అత్యధికంగా 4,012 మంది ఓటర్లు ఉన్నారు. కురవిలో 2,111 మహిళ ఓటర్లు, 1,901 పురుష ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత అత్యధికంగా రాజోలులో 2,242 ఓటర్లు, బలపాలలో 2,027, నేరడలో 1,995, సీరోలులో 1,853 మంది ఓటర్లు ఉన్నారు. కాంపెల్లిలో 1,685 ఓటర్లు, సూదనపల్లిలో 1,598, గుండ్రాతిమడుగులో 1346, కందికొండలో 1320, నల్లెల్లలో 1277, తట్టుపల్లిలో 1293, ఉప్పరిగూడెంలో 1097, కొత్తూరు (సి)1095, మొగిలిచర్లలో 1320, అయ్యగారిపల్లిలో 1357, చింతపల్లిలో 1082, నారాయణపురంలో 935, స్టేషన్ గుండ్రాతిమడుగులో 970, కొత్తూరు (జి) 630, తిర్లాపురంలో 622, బంగారుగూడెంలో 567 మంది ఓటర్లు ఉన్నారు. తండా, గ్రామపంచాయతీల్లో పెద్దతండా అత్యధికంగా 1652 మందిఓటర్లు కలిగి ఉండగా, తక్కువగా బంజరతండాలో 318 మంది ఓటర్లు ఉన్నారు.

కోర్టు కేసుతో ఆ మూడు గ్రామాలు..

మోద్గులగూడెం శివారు బేగావత్‌తండాను గత ఎన్నికల్లో జుజ్జుర్‌తండా గ్రామపంచాయతీ క్రింద ఉండాలని అధికారులు సూచించారు. అయితే బేగావత్‌తండావాసులు మేం ఉంటే మోద్గులగూడెం గ్రామం కింద ఉంటాం. కానీ, జుజుర్‌తండా కింద ఉండబోమని కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం బేగావత్‌తండా నూతన గ్రామపంచాయతీగా అవతరించింది. కేసు విత్‌డ్రా అయినప్పటికి నూతన ఓటరు లిస్టు ప్రక్రియ మొదలు కాలేదు. రాష్ట్రంలో ఇలా మొదలు కానివి 74 గ్రామపంచాయతీలు ఉన్నాయని, వాటికి సపరేటుగా ఓటరు లిస్టుల ప్రక్రియ మొదలవుతుందని అధికారులు తెలుపుతున్నారు.

రైతు కోసం.. రోడ్డెక్కుతాం..

- రుణమాఫీ లేదు.. రైతు భరోసా రాదు..
- ఈ నెల 30 వరకు వేచి చూస్తాం..
- పత్తికి మద్దతు ధర .. దొడ్డు వడ్లకు బోనస్ ఏమైంది?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు సమస్యలపై ఈ నెల 30వ తేదీ వరకు వేచి చూస్తాం.. ఆలోగా ప్రభుత్వం రైతుల సమస్యలపై నిర్ణయాలు తీసుకోకుంటే అన్నదాతల కోసం బీఆర్ఎస్ రోడ్డెక్కుతుంది. ఆ రోజుల్లో వరంగల్ రైతాంగానికి పెద్దదిక్కుగా ఉన్న ఎస్సారెస్పీ నీటి కోసం బాబ్లీ గేట్లు పగులకొట్టి జైలుకెళ్లాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ రైతులకు ఇచ్చిన హామీల అమలు కోసం రైతాంగం కోసం ఆందోళనలకు కార్యచరణ రూపొందిస్తున్నాం' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో చిట్‌చాట్‌లో పలు అంశాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు ఉంది..?

ఎర్రబెల్లి: ఓడినా.. గెలిచినా.. నేను ప్రజల మనిషిని. వారంలో నాలుగైదు రోజులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నా. రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతగా వారికి అండగా నిలబడాల్సిన బాధ్యత నాకు ఉంది.



ఆంధ్రజ్యోతి ప్రతినిధి: మాది ఇందిరమ్మ ప్రభుత్వం, రైతులకు అండగా ఉంటున్నాం.. అని చెప్పుతున్నారు కదా..?

ఎర్రబెల్లి: రైతు రుణమాఫీ సగం మందికి కూడా చేయలేదు. రైతు భరోసా రూ.15,000 ఎవరికైనా ఇచ్చారా..? కౌలు రైతులకు రూ.15వేల సాయం అందిందా..? 24గంటల కరెంట్ ఇస్తున్నారా..? పత్తికి మద్దతు ధర రూ.7,521లు వస్తున్నాయా..? ఎక్కడ రైతులకు ఈ ప్రభుత్వం అండగా నిలిచింది?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: సన్నవడ్లకు రూ.500బోనస్ ప్రకటించింది కదా..?

ఎర్రబెల్లి: ఎన్నికల్లో వడ్లకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో సన్నవడ్లకే బోనస్ అంటున్నారు. మన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70శాతం రైతులు దొడ్డు వడ్లే పండిస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతాంగానికి తీవ్రంగా నష్టం జరగటం లేదా..?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: మీ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా రైతులకు ఏం చేయలేదనే విమర్శలు ఉన్నాయి కదా..?

ఎర్రబెల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తేనే అన్ని చెరువుల్లోకి నీళ్లు వచ్చినయ్. ఉమ్మడి వరంగల్‌లో కొన్నిచోట్ల మూడు పంటలు తీసిండ్లు. ఇప్పుడు కాళేశ్వరం బంద్ చేసిండ్లు. సగం కూడా వరి సాగు కావటం లేదు. ఉమ్మడి వరంగల్‌కు ఎస్సారెస్పీ నీళ్లు, దేవాదుల నీళ్లు, రైతు బీమా, రైతుబంధు, 24గంటల ఉచిత కరెంట్ తెచ్చింది మేమే కదా..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: దేవాదుల ప్రాజెక్టును, ఎస్సారెస్పీని పట్టించుకోలేదు అనే ఆరోపణలు ఉన్నాయి కదా..?

ఎర్రబెల్లి: దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించింది చంద్రబాబు నాయుడు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదులను పెద్దగా పట్టించుకోలే. కేసీఆర్ సీఎం అయిన తరువాతే తుపాకులగూడెం వద్ద బ్యారేజీ కట్టినం. దేవాదుల 80శాతం పనులు పూర్తి చేసినం. ఎస్సారెస్పీకి నీళ్లు రాకుండా మహారాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడితే బాబ్లీ గేట్లు పగలకొట్టి వరంగల్ రైతుల కోసం జైలుకెళ్లాను.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: మొత్తానికి ఇప్పుడు రైతు ఎజెండాగా జనల్లోకి వెళ్లాలని నిర్ణయించారా..?

ఎర్రబెల్లి: ఇప్పుడు కష్టాల్లో ఉన్నది రైతులే కదా.. తేమ పేరుతో పత్తికి మద్దతు ధర, దొడ్డు వడ్లకు రూ.500బోనస్, రూ.15వేల రైతు భరోసా, కౌలు రైతు సాయం తదితర సమస్యల కోసం రైతుల కోసం రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నాం. రైతును ఏడ్పించిన ఏ రాజ్యం బాగుపడలేదు..


ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ఎప్పటి నుంచి రైతు కోసం ఆందోళనలు..?

ఎర్రబెల్లి: ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వానికి గడవు ఇచ్చాం. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే నవంబరు నెలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుకు అండగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

ఆధ్యాత్మికం

పురాతన విగ్రహాలు లభ్యం

రెడ్డికాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ములుగు రోడ్డు సమీపంలో పురాతన విగ్రహాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. వెంటనే స్థానికులు పూజలు నిర్వహించారు. హనుమకొండ ములుగురోడ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్నర్‌లోని పెట్రోల్ బంక్ వెనుక కొన్ని నిర్మాణాల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో పురాతన విగ్రహం బయట పడింది. ఆ నోట ఈ నోట బయటికి విషయం పొక్కడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో ఆ విగ్రహానికి పూజలు చేశారు.



లభ్యమైన విగ్రహాలు

దత్తక్షేత్రంలో వైభవంగా తైలాభిషేకం

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం స్వామివారికి తైలాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తైలంతో పాటు క్షీరాభిషేకం, పంచామృతాలను అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరాగా అందరి చేత ఉత్సవమూర్తికి తైలంతో భక్తులు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి అలంకరణ, మహా మంగళహారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారిని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్శించుకోవడానికి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన సత్రంలో భోజన ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారిని నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారులు, అధికారులు దర్శించుకున్నారు. ఈవో, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మీ పత్తి బంగారం కావాలంటే..

- జాగ్రత్తలు పాటించకపోతే ధరలో కోత
- రైతులు తేమ విషయంలో అప్రమత్తత పాటించాలి
- రైతులకు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల





వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ప్రతికూల పరిస్థితులతో అంతంత మాత్రం పత్తి దిగుబడి వచ్చింది. వచ్చిన పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు అవుతుంది. ఈ విషయంలో రైతులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా.. రైతులు పెద్ద ఎత్తున నష్టపోవాల్సి ఉంటుంది. పంటను ఎంతో శ్రద్ధతో సాగు చేసిన రైతులు వచ్చిన దిగుబడిని విక్రయించే సమయంలో మాత్రం కాస్త నిర్లక్ష్యం చేస్తుంటారు. ఫలితంగా ఆశించిన రీతిలో ధర రాదు. ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించింది ప్రభుత్వం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రావాలంటే.. పత్తి నాణ్యతగా ఉండాలి. తేమశాతం ఎక్కువగా ఉంటే ధర కోత పడుతుంది. ఇప్పటికే సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ? తేమకు సంబంధించి ఎలా అప్రమత్తంగా ఉండాలి. మంచి ధర రావాలంటే ఏం చేయాలనే అంశాలపై ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలతో మాట్లాడి అందిస్తున్న ప్రత్యేక కథనం.

పత్తి రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు..

- చేనుపై పత్తి పూర్తిగా విచ్చుకుని బుగ్గలున్న సమయంలో మాత్రమే పత్తి తీయాలి.
- పూర్తిగా ఆరిన తరువాత ఏ మాత్రం తేమలేని సమయంలో పత్తి పూర్తిగా విచ్చుకుని చివరకు చెట్టు నుంచి కారిపోవడం మీరు గమనించవచ్చు.
- చేను నుంచి తీసిన పత్తిని నీడలో ఒకటి రెండు రోజులు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తరువాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గానీ నిల్వ చేయడం వల్ల ఎలాంటి తేమ పెరుగదు.
- చేనుపై పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టుమీదనే పూర్తిగా ఆరేలా చూడాలి. ఆ తరువాతే పత్తి తీయాలి.
- ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే పరిస్థితి ఉంటుంది. నీటిని కలుపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒకటి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధరను పొదవచ్చు.
- పత్తిని ఉదయం పూట, సాయంత్రం సమయాల్లో కాకుండా కొద్దిగా ఎండ ఉన్న సమయాల్లో తీయాలి.
- పత్తిని తీసే కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. ఎలాంటి పత్తిని తీయాలనేది చెబితే బాగుటుంది. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడడాలి. వేర్వేరుగానే మార్కెట్‌కు తీసుకురావాలి.
- వివిద రకాలైన పత్తిని ఒకేచోట కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆరకం మార్కెట్‌కు తీసుకువెళ్లాలి.
- మార్కెట్‌కు పత్తిని సంచుల్లో కాకుండా ట్రాలీ వాహనాల్లో తీసుకురావడం వల్ల సీసీఐ కొనుగోలు చేస్తుంది.
- సీసీఐ పత్తి కొనుగోలు చేయాలంటే రైతులు ఈ సూచనలు పాటించాలి. రైతులు తమ బ్యాంకు ఖాతా మొదటి రెండు పేజీల జిరాక్స్, పట్టాదార్ పాస్‌బుక్, ఆదార్‌కార్డు. ఆధార్‌లింక్ ఉన్న మొబైల్(ఓటీపీ కోసం) తీసుకురావాలి.

తేమను ఇలా గుర్తిస్తారు

సీసీఐ పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8 శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమ శాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెలలో చూపిస్తుంది.



ఏనుమాముల మార్కెట్

తేమశాతాన్ని పెంచాలి

పత్తిలో తేమశాతాన్ని పెంచాలని రైతులు, రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 8 శాతం ఉన్న దానికి మాత్రమే మద్దతు ధర లభిస్తుంది. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా 8 నుంచి 12 వరకు తేమశాతం ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుంది. అలాకాకుండా 15 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

- పత్తికి మద్దతు ధర క్వింటా...రూ.7521లు

పత్తి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7521లు ప్రకటించింది. అకాల వర్షాలు, అనుకూలంగాలేని వాతావరణ పరిస్థితుల్లో పెరిగిన పెట్టుబడులు, కూలీల రేట్లు పెరిగిన నేపథ్యంలో రైతులు మద్దతు ధరను రాబట్టుకోవాలంటే తప్పకుండా సీసీఐ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. పత్తిలో తేమశాతం పెరిగిన కొద్దీ ధరలో కోత

పత్తిలో తేమ శాతం	మద్దతు ధర
8 శాతం	రూ.7.521
9 శాతం	రూ.7.445
10 శాతం	రూ.7.370
11 శాతం	రూ.7.295
12 శాతం	రూ.7.220

సైక్లింగ్‌తో ఆరోగ్యం, ఉత్సాహం

- సైక్లింగ్‌కు పోలీసులు కొంత సమయం కేటాయించాలి
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపు
- పోలీసు అమరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు సైక్లింగ్ చేయడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉండడంతోపాటు రోజంగా ఉత్సాహంగా తమ విధుల్లో రాణించొచ్చని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మకరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఏజే పెడల్స్, ట్రైసిటీ సైకిల్ రైడర్స్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈర్యాలీలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పచ్చజెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సైక్లింగ్ కోసం కొద్ది సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చని అన్నారు. అలాగే పోలీసు అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పోలీసు అమరవీరుల కుటుంబాలతో పాటు పోలీసు పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సైకిల్ ర్యాలీ పోలీసు కమిషనరేట్ కార్యాలయం నుంచి హనుమకొండ చౌరస్తా, ఎంజీఎం, మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు చేరి తిరిగి అదే మార్గం నుంచి బాలసముద్రం, నక్కలగుట్ట మీదుగా సీపీ కార్యాలయానికి చేరుకుంది. ఈ ర్యాలీలో సీపీ అంబర్ కిషోర్ ఝా సైకిల్ రైడర్స్‌తో కలిసి పాల్గొన్నారు. స్వయంగా సైకిల్ తొక్కుతూ సైకిల్ రైడర్స్‌ను ఉత్సాహపరిచారు. పోలీసు అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. సీపీతో పాటు యువకులు, చిన్నారులు, వృద్ధులు, పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరరం సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సైకిల్ రైడర్స్‌కు పోలీసు అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ ర్యాలీలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, అనంతయ్య, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఏజే పెడల్స్ యాజమాన్యం, ట్రైసిటీ సైకిల్ రైడర్స్, పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిట్ కళాశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో సీపీ అంబర్ కిశోర్ ఝా

నాడు ధూప దీపం.. నేడు పశువుల కొట్టం

పట్టించుకోండి..





హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలంలో నిర్మితమైన త్రికూటాలయం ఇది. నాడు రాజుల పాలనలో ఈ ఆలయం దూప దీప నైవేద్యాలతో నిత్యం కళకళాలాడుతూ ఉండేది. నేడు ఇది పశువుల పాకగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఈ ఆలయం ఆవరణలో పశువులను కట్టేసుకుంటున్నారు. ఇది వరంగల్ నగర సమీపంలో కొండపర్తి గ్రామంలోని ఓరుగల్లు చారిత్రక వారసత్వ సంపదకు సంబంధించి నాటి .. నేటి పరిస్థితి.

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ ఆంధ్రజ్యోతి హనుమకొండ

బాణసంచా.. జీరో దందా..

- జనవాసాల మధ్యలో టపాకుల దుకాణాలు
- నగరంలో అనధికారికంగా బాణసంచా గోదాములు
- ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ ఏది?
- అధికారులను ప్రసన్నం చేసుకుంటున్న వ్యాపారులు

వరంగల్ నగరంలో బాణసంచా జీరోదందా వ్యాపారం జోరుగా సాగుతోంది. జనవాసాల మధ్య టపాకుల దుకాణాలు వెలుస్తున్నాయి. అనధికారికంగా బాణసంచా గోదాములు, అక్రమంగా బాణాసంచా నిల్వలు పుట్టుకొస్తున్నాయి. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న షాపుల దందా నగరంలో యథేచ్ఛగా సాగుతోంది. అయినా ప్రభుత్వ శాఖలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు హడావుడి చేస్తూ తరువాత పట్టించుకోరనే విమర్శలున్నాయి.

మట్టెవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ప్రధాన రోడ్లపై జనవాసాల మధ్య బాణాసంచా వ్యాపారం జోరుగా నిర్వహిస్తున్నారు. నగరంలో టపాసుల వ్యాపారంలో అమ్మకందారులు బిజీబిజీగా బాణసంచా అమ్మకాల్లో తలమునకలయ్యారు. వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. వెలుగులు చిమ్మే దీపావళి పండుగను పురస్కరించుకొని నగరంలో బాణాసంచా విక్రయాలు ఊపందుకుంటున్నాయి. బాణసంచా వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కుతూ పెద్దమొత్తంలో బాణాసంచా నిల్వలు, అనధికార గోదాములు నిర్వహిస్తున్నారు. దుకాణాల సామర్థ్యానికి మించి విక్రయాలు చేయడం, అనధికారంగా గోదాముల్లో టన్నుల కొద్ది టపాకులు నిల్వ ఉంచుతున్నారు. వరంగల్ నగరం, శివారు ప్రాంతాల్లో అనధికారికంగా గోదాములు నిర్వహిస్తున్నారు. వీటిని తనిఖీ చేయాల్సిన అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అదికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

శివకాశి నుంచి..

దీపావళి సందర్భంగా నగరంలో రూ.కోట్లలో బాణసంచా వ్యాపారం జరుగుతుంది. తమిళనాడు శివకాశి నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, మానకొండూరు, హైదరాబాద్‌లోని రామాంతాపూర్, సిద్ధిపేట ప్రాంతాల్లో లక్షల కిలుల లైసెన్స్ కలిగిన గోదాములు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి వరంగల్‌లోని 9 పెద్ద బాణాసంచా షాపులకు సరుకు రవాణా జరుగుతుంది. వరంగల్ జిల్లాలో బాణాసంచా గోదాములకు అనుమతులు లేవు. అయితే ఇక్కడి వ్యాపారులు కొంతమంది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనుగోలు చేసిన బాణసంచాను అక్కడి నుంచి వరంగల్ నగరంలోని శివారు ప్రాంతాలలో అనధికారికంగా పెద్ద మొత్తంలో బాణాసంచా నిల్వ చేస్తున్నారు. విక్రయ లైసెన్స్ కలిగిన ఈ 9 షాపుల్లో ఏ ఒక్కటికీ గోదాము లైసెన్స్ లేవు.



సిండికేట్


వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు శివారు ప్రాంతాల్లో బాణాసంచా వ్యాపారం నిర్వహించే హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు సిండికేట్‌గా మారి తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అదే విధంగా 9 మంది బడా షాపుల యజమానులు సిండికేట్‌గా మారి తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

టపాకుల ధరల దడ

వరంగల్‌లో బాణాసంచా వ్యాపారులు టపాకుల ధరలను భారీగానే పెంచారు. దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని డిమాండ్‌కు అనుగుణంగా బాణసంచా విక్రయదారులు ధరలను పెంచారు. ముఖ్యంగా క్రాకర్స్, షాట్స్, చిచ్చుబుడ్డీలు, ఫ్యాన్సీ ఐటమ్స్‌ల ధరలు భారీగా పెరిగాయి. ఉదాహరణకు 120 షాట్స్ ధర శివకాశీలో 900 ఉంటే వరంగల్‌లో రూ.2000పైనే అమ్ముతున్నారు. 60 షాట్స్ 450 ఉండగా, వరంగల్‌లో 1500కు విక్రయిస్తున్నారు 30 షాట్స్ 225 ఉండగా, ఇక్కడ రూ.900కు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ శాఖలకు పండుగే..

దీపావళి పండుగ వచ్చిందంటే పలు ప్రభుత్వ శాఖలకు పండుగే. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను సిండిగేట్‌గా మారిన బాణాసంచా వ్యాపారులు ప్రసన్నం చేసుకొంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ యధేచ్ఛగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. బాణసంచా వ్యాపారులు పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖలతో పాటు స్థానిక పోలీసులకు ధనలక్ష్మీతో ప్రసన్నం చేసుకున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ సాగుతోంది.



డీఏ ప్రకటన అసంతృప్తికరం : యూటీఎఫ్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదా మాత్రమే ప్రభుత్వం విడుదల చేయడం అసంతృప్తిని మిగిల్చిందని యూటీఎఫ్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్క తిరుపతి, శనిగరపు రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో మూడు వాయిదాల డీఏ ఒకేసారి విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు.

ఈసారైనా పాటిస్తారా..?

నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా దుకాణాల నిర్వహణ ● ప్రతి ఏడాది అదే పరిస్థితి.. పట్టించుకోని అధికారులు



భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బాణసంచా లేని దీపావళిని ఊహించలేం. వెలుగులు విరజిమ్మే దివ్వెలైతే.. పండుగ వాతావరణాన్ని హోరెత్తించేవి టపాసులే. ప్రతిఒక్కరూ వీటిని సంబరంగా కాల్చుతారు. ఈఏడాది కూడా అలాంటి సందడే చూడబోతున్నాం. ఈ నెల 31న దీపావళి పండుగను జరుపుకోబోతున్నాం. ఈ నేపథ్యంలో టపాసుల దుకాణాల భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. అయితే.. వీటి ఏర్పాటులో పలువురు వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. షాపుల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాల్సిన ఐదు శాఖల అధికారుల్లో సమన్వయం లోపించడంతో ఇష్టారాజ్యం నెలకొందని తెలుస్తోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

నిబంధనల ప్రకారం ఒక దుకాణానికి, మరో దుకాణానికి మధ్య కనీసం మూడు అడుగుల దూరం ఉండాలి. కానీ.. చాలా చోట్ల దీన్ని గాలికి వదిలేస్తున్నారని తెలుస్తోంది. కనీస దూరం కూడా పాటించకుండా వరుస క్రమంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ప్రతి దుకాణం వద్ద బకెట్లలో ఇసుక, 200 లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. దుకాణ నిర్వాహకులు డ్రమ్ముల్లో నీటిని అందుబాటులో పెట్టుకుం టున్నా ఇసుకను మాత్రం ఉంచుకున్న దాఖలా ల్లేవు. వీటితో పాటు దుకాణంపై జింక్ లేదా సిమెంట్, ఐరన్ రేకులను మాత్రమే వాడాలి. వీరంతా వెదురు కర్రలు, రంగురంగుల క్లాత్‌తో ఏర్పాటు చేసుకుంటున్నారు. ఫైర్ సేఫ్టీ, విద్యుత్ పరి కరాలు అందుబాటులో ఉంచుకోవడం లేదు. ఇలా చాలా మంది వ్యాపారులు ప్రతి ఏటా నిబంధనలు అతిక్రమిస్తూనే ఉన్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం!

టపాసుల దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే తెలుత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత అగ్నిమాపక శాఖతో పాటు పోలీసు, రెవెన్యూ, విద్యుత్, తూనికలు కొలతల శాఖల పర్మిషన్లు కూడా పొందాలి. ఈ శాఖల అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుణంగా అనుమతులు ఇస్తారు. అయితే.. ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఎక్కాగా నిబంధనలు అమలుకావడం లేదు. ఆయా శాఖల అధికారులంతా ప్రత్యేక సమన్వయ కమిటీగా ఏర్పడి కార్యాచరణతో ముందుకు పోవాల్సి ఉండగా అలాంటి సందర్భంగా జిల్లాలో కనిపించడం లేదు.

> **నిబంధనలు అమలయ్యేలా చర్యలు**
>
> 
>
> దీపావళి పండుగ వేళా ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల్లో నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా చూస్తాం. అతిక్రమించే వారిపై చర్యలు ఉంటాయి. దుకాణాల విధివిధానాలపై నిర్వాహకులకు జిల్లా వ్యాప్తంగా ముందే సూచనలు చేశాం. ఆరు మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చాం. ఎక్కడా ప్రమాదాలు జరగకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పటిష్ఠ చర్యలు చేపడుతాం.
>
> - కుమారస్వామి, ఇన్‌చారి ఫైర్ ఆఫీసర్ (భూపాలపల్లి)

తోచినంత దోచుడే..

టపాసుల దుకాణాల నిర్వాహకులు వినియోగదారుల నుంచి తోచినంత దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధిక ధరలు తీసుకుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్ణీత ధర కంటే మూడు నుంచి ఐదింతలు అధికంగా వినియోగదారుల నుంచి వ్యాపారులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రతి ఏడాది జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంటుండగా కనీసం ఈసారైనా నిర్వహకులు నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరు మండలాల్లో 45 దుకాణాలకు అనుమతి

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకోనేందుకు ఆరు మండలాల నుంచే వ్యాపారులు ఆసక్తి కనబర్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 45 దుకాణాలకు అనుమతులు అగ్నిమాపక శాఖ నుంచి లభించాయి. భూపాలపల్లిలో 28, గణపురంలో 5, చిట్యాలలో 2, కాటారంలో 6, మహదేవపూర్‌లో 3, రేగొండలో ఒక దుకాణానికి దరఖాస్తు చేసుకోగా, వాటిని పరిశీలించి తాత్కాలికంగా అనుమతి ఇచ్చినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. అయితే.. మిగిలిన టేకుమట్ల, మొగుళ్లపల్లి, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో అధికారికంగా ఏ ఒక్క దుకాణం ఏర్పాటుకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. అలాగే వివిధ గ్రామాల్లో వ్యాపారులు అనధికారికంగా చిన్న చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకొని విక్రయాలు సాగనున్నట్లు తెలిసింది. అలా అనుమతులు లేకుండా విక్రయాలు చేపడితే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు గతంలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

సంక్షిప్త వార్తలు

చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడిగా నరేందర్

చిట్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి చేనేత ఐక్య వేదిక జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కట్కూరి నరేందర్‌ను నియమించారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగిం చిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని అన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహా సభ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం డివిజన్ నాయకులు గడ్డం చంద్రయ్య, అబ్బినవేన ఐలయ్య, తొట్ల శ్రీశైలంగడవేన దేవేందర్ ఆధ్వ ర్యంలో మండలంలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా జాగరి ఓదెలు, అధ్యక్షుడిగా జాగరి వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా పర్శవేన ఓదెలు, గెల్లు రాజు, జాగరి మహేష్, ప్రధాన కార్యదర్శిగా జాగరి సమ్మయ్య, కోశాధికారిగా మాదర బోయిన కుమారస్వామి, ముఖ్య సలహాదారుగా జాగరి రాజయ్య ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన గుంటి కుమార్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఏఎస్సై మొగిలి ఆదివారం అప్పగించారు. తాను ఫోన్‌ను పోగొట్టుకున్నానని పోలీసులకు ఇటీవల కుమార్ ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందించినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ సమ్మేళనం

గణపురం, అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): ధర్మ సమాజ్ పార్టీ మండల ముఖ్య నాయకులు మండల కేంద్రంలో కార్యకర్తల సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కుర్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు, ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విక్రం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

కాటారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గంగారం క్రాస్ రోడ్డు వద్ద సీసీ కెమెరాలను సీఐ నాగార్జునరావు ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఎస్సై మ్యాక అభినవ్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామప్రజలు, నాయకులు, వ్యాపారుల సహకారంతో పోలీసు అధికారులు నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సమీపంలోని చెక్‌పోస్టు వద్ద డిస్‌ప్లే స్క్రీన్ బిగించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, ఆటో యూనియన్ నాయకులు సమ్మిరెడ్డి, తిరుపతి, వెంకటస్వామి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించడం హేయం

తాడ్వాయి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులోని ప్రభుత్వభూమిలో కొన్నేళ్లుగా పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మండల నాయకుడు పైడిపల్లి అశోక్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన మండల కేం ద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పేదల కోసం అహర్నిషలు కృషిచేస్తున్నామని తెలుపుతున్నా ప్రజాప్రతినిధులు గత పది సంవత్సరాల క్రితం పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం సరికాదని, ఈసం ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలను గుర్తించి గుడిసెలు వేసుకున్న స్థలంలోనే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టిప్పర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

గణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దుగ్గిశెట్టి హరికృష్ణ, ఊర నవీన్‌రావు, అధ్యక్షుడిగా జక్కం భద్రయ్య, ప్రధానకార్యదర్శిగా పొనగంటి సతీష్, ఉపాక్ష్యక్షుడిగా నవీన్‌రెడ్డి, కోశాధికారి రాజేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కోరె మహేందర్ ఎన్నికయ్యారు.

ఘనంగా ఎర్రమ్మతల్లి గుడి వార్షికోత్సవం

ఏటూరునాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద ఎర్రమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎర్రమ్మ దేవతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వంగూరి నాగేశ్వరరావు, అర్చకులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఎర్రమ్మ తల్లికి చీరలు, సారెలను సమర్పించి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, కమిటీ సభ్యులు వలస శ్రీనివాస్, గుర్రపు రంగయ్య, ఊరుగో నర్సయ్య, నల్లబోయిన కోటయ్య, ఇర్సవడ్ల భిక్షపతి, చిప్ప అశోక్, కర్ర రవీందర్, సర్వ వెంకన్న, చేన్న ముత్తయ్య, తిరుపతి, విష్ణుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఆత్మీయ వీడ్కోలు

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాటారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి ఇటీవల రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఆదివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. జరిగింది. ఎస్సై అభినవ్ సన్మానించారు. విధి నిర్వహణలో సహకరించిన పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది, ప్రజలకు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ధనసరి సూర్య

ఏటూరునాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ జరిగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మురళి ఎలెవన్, షారు ఎలెవన్ జట్లు తలపడ్డాయి. షారు ఎలెవన్ జట్టు 15 ఓవర్లకు ఎనిమిది వికెట్ల నష్టానికి 89 పరుగులు చేయగా మురళి ఎలెవన్ జట్టు 13 ఓవర్లకు మూడు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసి విజయం సాధించింది. గెలుపొందిన మురళి ఎలెవన్ జట్టుకు కప్‌తోపాటు రూ. 30వేలు మొదటి బహుమతి, రెండో బహుమతి షారు ఎలెవన్ జట్టుకు సూర్య అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యురాలు వలియాబీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బోల్తా

ప్రైవేటు పనికి తీసుకెళ్లగా ప్రమాదం



నిమ్మగూడెంలో బోల్తా పడ్డ ట్రాక్టర్

మహాముత్తారం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మగూడెం పంచాయతీకి చెందిన ట్రాక్టర్ శనివారం రాత్రి గ్రామ సమీపంలో బోల్తా పడింది. సాయంత్రం 5 గంటల లోపు గ్రామపంచాయతీ ఆవరణలో ఉంచాల్సిన ట్రాక్టర్‌ను నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోలేందుకు తీసుకెళ్లగా ఈ ప్రమాదం జరిగింది. పంచాయతీ పని పూర్తయిన అనంతరం ప్రైవేటు పనికి వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగిందని, ఇందుకు కారణమైన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకో వాలని గ్రామస్థులు అంటున్నారు. ప్రమా దంలో ట్రాక్టర్ పూర్తిగా దెబ్బతిందని, దీనికి సుమారు రూ. లక్ష ఖర్చు అవు తుందని తెలిపారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా ట్రాక్టర్ ప్రమాదానికి గురైన విషయం వాస్తవమేనని అన్నారు. పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఓసీ-3 ట్రక్ డ్రైవర్స్



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణను సన్మానిస్తున్న ఓసీ-3 ట్రక్ డ్రైవర్స్

గణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌కాస్టు-3 ట్రక్ డ్రైవర్స్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సైతం పండుగ బోనస్‌గా రూ. 5వేలు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రక్ డ్రైవర్స్ పుప్పాల దీపక్, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, సురేందర్, ఉపేందర్, శివ, సంపత్, రాజు, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు, చేపల పంపిణీ

రేగొండ (ఆంధ్రజ్యోతి): మండంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పర్యటించారు. పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. చౌటకుంట చెరువులో చేపల పంపిణీ చచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాల అమలు పేరిట అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సంపత్‌రావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, పున్నం రవి, రొంటాల సదయ్య, కొలెపాక సాంబయ్య, పట్టెం శంకర్, మేకల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సర్వేను

పకడ్బందీగా చేపట్టాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 27: త్వరలో చేపట్టనున్న సామాజిక, ఆర్థిక సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. ప్రతి ఇంటినీ సర్వే చేయాలని, ఎక్కడా లోటుపాట్లు ఉండొద్దని అన్నారు. తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో ఆయన ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే నిర్వహణకు 933 మంది ఎన్యూమరేట్ల అవసరం ఉందన్నారు. పదికి ఒక మండల స్థాయి అధికారిని పర్యవేక్షకుడిగా నియమించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, డీఆర్డీవో సిబ్బందిని ఎన్యూమరేట్లరుగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో వీకిఇ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సామాజిక సర్వేను మొత్తాన్ని అదనపు కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నియామకపు పత్రాలు సోమవారం ఇవ్వనున్నటు తెలిపారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేసి డేటా ఎంట్రీ చేయాలన్నారు. భూపాలపల్లి పట్టణంలో సిబ్బందిని ఎంపిక చేయాలని మునిసిపాల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, డీఆర్డీవో అవినాష్ పాల్గొన్నారు.

ఘనంగా మాల మహానాడు

ఆవిర్భావ దినోత్సవం

ఏటూరునాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాల మహానాడు ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాదరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దళితుల ఐక్యత, రాజ్యాంగ రక్షణ, మాలల అస్తిత్వమే లక్ష్యంగా బుద్ధుడు, పూలే, అంబేద్కర్ సిద్ధాంతాలను గ్రామ గ్రామాన తీసుకెళ్లాలన్నారు. మాలల మనువాదులు అంటూ మంద కృష్ణ మాదిగ విషం చిమ్ముతున్నారని విమర్శించారు. దళితులను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ భుజంపైన తుపాకీ పెట్టి మాలలపై ప్రధాని మోదీ గురిపెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాలల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్ కాళ్ల రామకృష్ణ, ఉద్యోగుల సంఘం నాయకుడు గంపల నర్సయ్య, చిక్కుల కిరణ్, నారా చందు, చిక్కుల చంద్రబాబు, పేయల సమ్మయ్య, మాదరి చంద్రమౌళి, బోడ సారయ్య, మాదరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిర్చి సాగు

మల్చింగ్ పద్ధతిని పాటిస్తున్న రైతులు



ఏటూరునాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో రైతులు మిర్చి పంట సాగు ముమ్మరం చేస్తున్నారు. ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంటకటాపురం మండలాల్లో సుమారు 6 వేల ఎకరాలకు పైగా మిర్చి సాగు అవుతోంది. ఇందులో 40 శాతం రైతులు మల్చింగ్ పద్ధతిని పాటిస్తున్నారు. ఈ విధానం ప్రాథమికంగా మంచి దిగుబడిని అందించగలిగినప్పటికీ ఖర్చులు పెరగడంతో రైతులు ఆర్థికంగా కష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు సీడ్, కొందరు రైతులు 341, 941, 41, 641, తేజ వంటి రకాల విత్తనాలను వేసుకున్నారు. రైతులు తమ పంట చెనులో ముమ్మరంగా మొక్కలను నాటుతున్నారు. కానీ రైతులకు ఎండ తీవ్రతతో నాటిన మొక్కలు చనిపోతుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు జూలై, ఆగస్టులో పోసిన నార్లు వర్షాలు ఎక్కువగా పడి చనిపోవడంతో పాటు ఎండకు మునిగిపోయి మిర్చి మొక్కలు సరిపోక కొనుగోలు చేస్తున్నారు. మొక్కలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పెట్టుబడుల భారం ఎక్కువగా అవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడుల భారం

గతంలో రైతులు మిర్చి పంట సాగు చేసేందుకు ఎద్దుల నాగళ్లతో దుక్కులు దున్ని పంట సాగు చేసుకునేవారు. తోటలో గడ్డి పట్టిన సమయంలో పైపాటు చేసుకుని సాగు చేసేవారు. ఇటీవల రైతులు పని భారాన్ని తగ్గించుకునేందుకు మిర్చి సాగులో ల్యాడర్, పైపులు, పేపర్, వెంచర్లు వేసి సాగు చేస్తున్నారు. ట్రాక్టర్ దుక్కులకు ఎకరాకు సుమారు రూ. 12 వేలు, ల్యాడర్లు ఎకరాకు రూ. 7,500, పేపర్ రూ. 15,500, పైపులు రూ. 6 వేలు, కూలీలకు ఎకరాకు రూ. 5 వేలు ఖర్చు చేస్తున్నారు. వీటితోపాటు మొక్కవేత వేసే ముందు రైతులు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. మొక్కవేతకు రైతులు ఎకరాకు సుమారు రూ. 60 వేలు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. పంట పూర్తయ్యే వరకు లక్షల్లో పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు ఎక్కువైతే దిగుబడి ఎలా వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

కూలీలకు దక్కని పనుల

ఏజెన్సీలో నిరుపేద కూలీలు జీవనోపాధి కోసం వ్యవసాయ పనులపై ఆధారపడి ఉంటారు. రైతులు మల్చింగ్ వంటి సాంకేతిక పద్ధతులను అవలంబివచడం వల్ల మిర్చి తోటల్లో కలుపు తీసే పనులు తగ్గిపోతు న్నాయి. మల్చింగ్ వల్ల కలుపు మొక్క లు పెరగకుండా నిరోధించబడుతుండటంతో కూలీలకు పనులు దొరకడం లేదు.

నాణ్యమైన దిగుబడి వస్తుందని..

మల్చింగ్ పద్ధతి అనుసరించడం ద్వారా రైతులకు పలు లాభాలు ఉన్నాయి. ఈ విధానంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది. నీటి సంరక్షణతో పాటు మట్టిలో తేమ నిల్వచేయడానికి మల్చింగ్ సహాయపడుతుంది. ఈ విధానంతో ఎరువుల వినియోగం తగ్గడం, తెగుళ్ల అరికట్టం, చీడ పురుగులను నివారించడం కూడా సాధ్యమవుతుంది. మల్చింగ్ వల్ల సస్యరక్షణ చక్కగా ఉంటుంది. పైగా రైతులకు శ్రమ తగ్గుతుంది. కూలీలు ఉన్నాలేకున్నా పంటను సులభంగా నిర్వహించగలమని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా కలుపు మొక్కలు పెరగకుండా నియంత్రణ చేయడం వల్ల మానవ శక్తి అవసరం తగ్గిపోతుంది.

